# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# వికీలీక్స్ వీరునికి విముక్తి

**అసాంజే** ఓ సాధారణ కలం వీరుడు. అయితే సమాచార స్వేచ్ఛ కోసం తన జీవితాన్ని పణంగా ఒడ్డి, కత్తుల వంతెన దాటాడు. అగ్ర రాజ్య ఆగ్రహజ్వాలలు తట్టుకుని నిలిచాడు. అతని పోరాటాన్ని, త్యాగాలను ప్రపంచం చాలాకాలం పాటు గుర్తుంచుకుంటుంది. ప్రభుత్వ రహస్యాల గనులను తవ్విపోసి ప్రపంచం ముందు పరచడమే అతడు చేసిన మహానేరం. సర్కారీ చీకటి కోణాలపై వెలుగులు ప్రసరించడమే ఘోర పాపం. వికీపీడియా యుగంలో అసాంజే వికీలీక్స్ ప్రపంచవ్యాప్తంగా రాజకీయ భూకంపం సృష్టించాయి. ప్రస్తుత సమాచార హక్కు యుగంలో ప్రభుత్వాలు అధికార రహస్యాల ముసుగు కింద కమ్మేసే అకృత్యాలను వెలికితీసే పని ఓ మహా సాహసమే. ఎవరో ఒకరు పిల్లి మెడలో గంట కట్టాలి. ఎవరో ఒకరు మన కోసం చరిత్ర గతిని శాసించాలి. ఆ పని అసాంజే చేశాడు. మీడియా శక్తి ఏమిటో, పారదర్శకత విలువ ఏమిటో చాటిచెప్పాడు. టన్నుల కొద్దీ రహస్యాలు బయటపెట్టాడు. ఏం బయటపెట్టాడు? ఎంత బయటపెట్టాడు? అనేది ముఖ్యం కాదు. ఆ సాహసమే ఓ ఒరవడిని దిద్దింది. మీడియా అనేది రాజీపడుతూ 'ఆకాశంబు నుండి శంభుని శిరంబందుండి' కిందికి జారి సైడు కాలువల్లో ప్రవహిస్తున్న వేళ అసాంజే అద్వితీయమైన రీతిలో భావప్రకటనా స్వేచ్ఛా పతాకాన్ని ఎగరవేశాడు. స్వేచ్ఛా పిపాసులకు ఓ హీరోలా, ప్రభుత్వాల పాలిట విలన్‌లా నిలిచాడు.

అసాంజే స్థాపించిన వికీలీక్స్ ప్రజల దృష్టికి ఎన్నడూ రాని రహస్య పత్రాలను తవ్వితీస్తే ప్రభుత్వాలు వణికిపోయాయి. ఇబ్బందికరమైన పరిస్థితులను ఎదుర్కొన్నాయి. దౌత్యపరమైన వివాదాలూ తలెత్తాయి. రాజీనామాలు జరిగాయి. వికీలీక్స్‌లో బయటపెట్టినవి చిన్నాచితకా విషయాలేం కావు. అందునా అమెరికా పరువు తీసే రహస్యాలను వీధుల్లో ఊరేగిస్తే అగ్రరాజ్యం చూస్తూ ఊరుకుంటుందా?! ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్ యుద్ధాలకు సంబంధించిన ఎన్నో రహస్యాలు వెలుగులోకి వస్తే ప్రపంచం ఔరా అని ముక్కు మీద వేలేసుకుంది. యుద్ధం ముసుగులో జరిగే నేరాలు, ఘోరాలను వెలికితీయడం సంచలనం కలిగించింది. ఇరాక్ యుద్ధంలో అమెరికా హెలికాప్టర్ ఇద్దరు జర్నలిస్టులతో సహా 11 మంది సాధారణ పౌరులను కాల్చిచంపి, వారికి సాయంగా వచ్చిన వ్యానుపైనా గుండ్లవర్షం కురిపించే వీడియో దుమారం రేపింది. అమెరికాను ఇరకాటంలో పడేసింది. ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మగా చెప్పుకునే అమెరికా అసలు స్వరూపం ఇదీ అని ప్రపంచానికి చాటిచెప్పడమంటే సింహం జూలుతో ఆడుకోవడం లాంటిదే. అది పిల్లలాట కాదు.

అమెరికా జాతీయ భద్రతా సంస్థ (ఎన్ఎస్ఏ) విదేశీ నేతలపైనే కాదు, పౌరులపైనా నిఘా వేసిందని, పాకిస్థాన్ మొబైల్ నెట్‌వర్క్‌లోకి చొచ్చుకుపోయిందని అసాంజే వెల్లడించడం మరో సంచలనం. సర్వశక్తివంతమైన ప్రభుత్వాలను ఢీకొట్టడంలో సమస్యలుంటాయి. వికీలీక్స్ తెగువపై అమెరికా గుడ్లురిమింది. గూఢచర్య నేరం మోపి జైలులో పెట్టాలని తలపెట్టింది. వేట మొదలుపెట్టింది. కానీ అసాంజే చేతికి చిక్కితే కదా. బ్రిటన్‌లోని ఈక్వెడార్ దౌత్య కార్యాలయంలో ఆశ్రయం పొంది సుదీర్ఘకాలం పాటు అక్కడే ఉండిపోవడం ప్రపంచవ్యాప్తంగా చర్చాంశమైంది. తర్వాత బ్రిటన్ అరెస్టు చేసి జైల్లో పెట్టింది. అటు ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వంటి అంతర్జాతీయ హక్కుల సంస్థలు అసాంజే నిర్బంధంపై నిరసన తెలిపాయి. ప్రపంచ ప్రజాభిప్రాయం కూడా అసాంజేకు అనుకూలంగా మారుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో అసాంజేను అమెరికా అదుపులోకి తీసుకుని విచారించింది. రాజీ ఫార్ములాలో భాగంగా నామమాత్రపు విచారణ జరిపి విడుదల చేసింది. ఓ వైపు అమెరికా గూఢచార రహస్యాల చట్టం ఉల్లంఘించినట్టు ఒప్పుకొన్న అసాంజే అమెరికాలో భావప్రకటనా స్వేచ్ఛకు దన్నుగా నిలిచే ఫస్ట్ అమెండ్‌మెంట్ సాయంతో గట్టెక్కడం విశేషం. ఎట్టకేలకు సంకెళ్లు ఛేదించుకుని అసాంజే స్వేచ్ఛావాయువులు పీల్చుకోవడం శుభపరిణామం.

# కేసీఆర్ కరెంటుతోనే 'ఐటీ' వెలుగులు



కడవేర్గు రాజశేఖర్

సమైక్య పాలనలో పరిశ్రమలకు పవర్ హాలీడే ఎంత సుపరిచితమో.. ఐటీ సెక్టార్‌కు పవర్ కట్ అంతే సుపరిచితం. నాడు ఆఫీస్‌లో లాగిన్ అయి వర్క్ స్టార్ట్ చేయకముందే జనరేటర్ స్టార్ట్ అయ్యేది. క్లయింట్‌తో మాట్లాడకముందే పవర్ కట్ పలకరించేది. వెరసి కరెంట్ కోతలు.. ఉద్యోగులు, కంపెనీల వెతలు. నాణ్యత లేని కరెంటు కారణంగా రాష్ట్రంలో ఉన్న ఒకటీ, అరా కంపెనీలు హైదరాబాద్‌ను వీడేవి. ఇదంతా తెలంగాణ రాకముందు, కేసీఆర్ సర్కార్ అధికార పీఠాన్ని ఎక్కకముందు మాట. కానీ, ఇప్పుడు ఐటీ ఇండస్ట్రీకి హైదరాబాదే కేరాఫ్ అడ్రస్. అందుకు ప్రధాన కారణం కేసీఆర్ సర్కార్ సరఫరా చేసిన 24 గంటల కరెంటేనన్నది జగమెరిగిన సత్యం.



నిరంతరాయ కరెంటు సరఫరా, మౌలిక వసతుల కల్పనతోనే ఐటీ కంపెనీలు రాష్ర్టానికి వరుస కడుతాయని భావించిన కేసీఆర్.. ఆ దిశగా పటిష్ఠమైన కార్యాచరణను రచించారు. దాని ఫలితంగానే గడిచిన పదేండ్లలో ఐటీ ఎగుమతులు నాలుగు రెట్లు, ఉద్యోగాలు మూడు రెట్లు పెరిగాయి. అంతేకాకుండా ఐటీ, ఐటీఈఎస్ కార్యకలాపాల కోసం వినియోగించే ఏ-గ్రేడ్ ఆఫీసు స్పేస్ లీజింగ్‌లోనూ బెంగళూరును హైదరాబాద్ దాటిపోయింది. ఇదంతా కేసీఆర్ హయాంలో సరఫరా చేసిన 24 గంటల కరెంటుతో పాటు విప్లవాత్మకమైన విధానాల వల్లే సాధ్యమైంది.

**ఐటీకి కేరాఫ్ హైదరాబాద్:** సమైక్యపాలనలో హైదరాబాద్‌లో కొన్ని ఐటీ కంపెనీలు ఉన్నప్పటికీ.. విద్యుత్తు కోతలతో ఐటీ ఎగుమతులకు తీవ్ర అంతరాయం కలిగేది. దీంతో బెంగళూరు వంటి నగరాలకు ఐటీ కంపెనీలు తరలిపోయే ప్రమాదం ఏర్పడింది. దీంతో 2014లో అధికారంలోకి వచ్చిన వెంటనే నిరంతరాయ కరెంటు, మౌలిక వసతుల కల్పనపై కేసీఆర్ ప్రభుత్వం దృష్టిసారించింది. కొత్త స్టార్టప్‌ల ఏర్పాటుకు నైపుణ్య శిక్షణనిచ్చే ఇంక్యుబేటర్లను ఏర్పాటు చేసింది. ప్రోత్సాహకాలు అందించింది. అలా ప్రభుత్వ సమగ్ర కార్యాచరణ విధానాల వల్ల ఐటీ పరిశ్రమ పరుగులు పెట్టింది. దేశానికి ఐటీ హబ్‌గా తెలంగాణ మారింది. ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో స్థానం పొందిన గూగుల్, అమెజాన్, యాపిల్, ఫేస్‌బుక్, మైక్రోసాఫ్ట్ వంటి 20కి పైగా బహుళజాతి కంపెనీలు (ఎంఎన్‌సీ) హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్నాయి. అలా.. 'తెలంగాణ ఏర్పాటైతే ఉద్యోగాలు ఉండవు. ఐటీ ఢమాల్ అవుతుంద'న్న వాళ్ల నోళ్లను మూయిస్తూ.. తెలంగాణ ఐటీ కొత్త శిఖరాలను అధిరోహించింది. అంతేకాదు, ఐటీ అభివృద్ధితో ఆ రంగంపై ఆధారపడ్డ ఇతర రంగాలూ ఎంతో లాభపడ్డాయి. ఒక్క ఐటీ ఉద్యోగం సృష్టితో పరోక్షంగా మరో నాలుగు ఉద్యోగాలు వస్తాయని అంటారు. తెలంగాణలో ఐటీ వృద్ధి కారణంగా రియల్ ఎస్టేట్, హాస్పిటాలిటీ, వినోదం, రవాణా, లాజిస్టిక్ రంగాలు రాకెట్ వేగంతో దూసుకుపోయాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 లక్షల మందికి ఉపాధి లభించింది.

**ఐటీ ఎగుమతులు ఇలా...:** బీఆర్ఎస్ పాలనలో ఐటీ ఎగుమతులు దాదాపు నాలుగు రెట్లు పెరిగాయి. ఐటీ రంగం పెట్టుబడులకు తెలంగాణ కేంద్రంగా మారింది. జిల్లా కేంద్రాలు, ద్వితీయ శ్రేణి పట్టణాలకు కూడా సాఫ్ట్‌వేర్ కంపెనీలు వచ్చాయి. ఐటీ రంగానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రాధాన్యతను గుర్తించిన కేసీఆర్ ప్రభుత్వం.. ప్రతీ ఐదేండ్లకు ఒకసారి ఐటీ పాలసీని కొత్తగా రూపొందించాలని నిర్ణయించింది. అందులో భాగంగా 2016, 2021లో మెగా పాలసీలను రూపొందించి విజయవంతంగా అమలు చేసింది. అంతేకాదు, 2016లో తీసుకొచ్చిన పాలసీలో సబ్ క్యాటగిరీల పేరిట ఐటీలో తీసుకొచ్చిన విప్లవాత్మక నూతన విధానాలు ఓ చరిత్రనే సృష్టించాయి. టీహబ్, టీహబ్ 2.0, టీవర్క్స్, వీహబ్, టీఎస్ఐటీ, రిచ్ వంటి ఇంక్యుబేటర్లను ఏర్పాటు చేయడమే కాదు.. వాటిని సమర్థవంతంగా నిర్వహించింది.

**ఐటీలో కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన పాలసీలు**

తెలంగాణ ఐసీటీ పాలసీ (2016)
ఎలక్ట్రానిక్స్ పాలసీ (2016)
ఇన్నోవేషన్ పాలసీ (2016)
డేటా సెంటర్స్ పాలసీ (2016- దేశంలోనే మొదటిది)
ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) పాలసీ (2017)
బ్లాక్ చెయిన్ పాలసీ (2019- దేశంలోనే మొదటిది)
డ్రోన్ పాలసీ (2019 - దేశంలోనే మొదటిది)

### మీకు తెలుసా?

- దేశంలోని మొత్తం ఐటీ ఉద్యోగాల్లో 44 శాతం వాటా తెలంగాణదే.
- టాప్-5 గ్లోబల్ టెక్ కంపెనీలు హైదరాబాద్ లోనే ఉన్నాయి.
- బెంగళూరును కాదని, హైదరాబాద్‌లో ఉద్యోగాల కోసం నెలకు సగటున 10 వేల మంది టెక్ ఉద్యోగులు లొకేషన్ షిఫ్ట్‌కు అప్లై చేశారు.

### మీకు తెలుసా?

- తెలంగాణ ఏర్పాటు సమయంలో 3 స్టార్టప్ ఇంక్యుబేటర్లు, 200 స్టార్టప్ కంపెనీలు మాత్రమే ఉండేవి. 2023 నాటికి అవి 77 ఇంక్యుబేటర్లు, 7 వేలకు పైగా స్టార్టప్‌లకు పెరిగాయి.

**అంతర్జాతీయ రికార్డులు:** కేసీఆర్ హయాంలో జరిగిన ఐటీ అభివృద్ధితో గ్లోబల్ స్టార్టప్ ఎకో సిస్టంలో తెలంగాణ సత్తా చాటింది. ప్రపంచంలోనే అతిపెద్ద స్టార్టప్ నివేదికగా చెప్పుకొనే జీఎస్ఈఆర్-2022లో రాష్ర్టానికి స్థానం దక్కడం విశేషం. గ్లోబల్ స్టార్టప్ ఎకో సిస్టంలో తెలంగాణ టాప్-10 జాబితాలో స్థానాన్ని సంపాదించింది. ఏషియన్ ఎకో సిస్టం ఇన్ అఫర్డబుల్ టాలెంట్ జాబితాలోనూ టాప్‌ప్లేస్‌లో నిలిచింది.

**ఐటీ ఎగుమతులు, ఉద్యోగాలపై 'ది ఎకానమిస్ట్' ఏమన్నదంటే?:** కేసీఆర్ పాలనలో ఐటీ రంగం సాధించిన గణనీయమైన ప్రగతిపై ప్రపంచ ప్రఖ్యాత వీక్లీ మ్యాగజీన్ 'ది ఎకానమిస్ట్' ఇటీవల ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. గడిచిన పదేండ్లలో తెలంగాణలో ఐటీ రంగం కొత్త పుంతలు తొక్కినట్టు వెల్లడించింది. 2014 నుంచి 2023 వరకు తొమ్మిదేండ్లలో ఐటీ ఎగుమతులు నాలుగు రెట్లు పెరిగాయని, తెలంగాణలో ఐటీ ఎగుమతుల విలువ ప్రస్తుతం 29 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్టు వివరించింది. పదేండ్లలో ఐటీ రంగంలో మూడు రెట్ల మేర ఉద్యోగాలు పెరిగి 9 లక్షలకు చేరినట్టు వెల్లడించిన పత్రిక.. తెలంగాణ రాజధాని హైదరాబాద్ ఐటీ హబ్‌గా మారిందని, ఏటా లక్షలాదిమంది ఈ నగరానికి ఉద్యోగాల కోసం క్యూ కడుతున్నట్టు వివరించింది. తెలంగాణ ఏర్పాటైన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం టెక్ వ్యూహాన్ని రెట్టింపు చేసినట్టు కొనియాడింది.

**కేసీఆర్ పాలనలో ఐటీ రంగం సాధించిన గణనీయమైన ప్రగతిపై ప్రపంచ ప్రఖ్యాత వీక్లీ మ్యాగజీన్ 'ది ఎకానమిస్ట్' ఇటీవల ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. గడిచిన పదేండ్లలో తెలంగాణలో ఐటీ రంగం కొత్త పుంతలు తొక్కినట్టు వెల్లడించింది.**

### తొమ్మిదేండ్లలో ఐటీ ఉద్యోగాల కల్పన ఇలా..

| | |
|---|---|
| 2014లో - | 3,71,774 |
| 2023లో - | 9,05,715 |
| పెరుగుదల - | 143 శాతం |

### తెలంగాణలో ఐటీ ఉద్యోగాలు ఇలా..

| సంవత్సరం | ఉద్యోగాలు |
|---|---|
| 2014-15 | 3,71,774 |
| 2015-16 | 4,07,385 |
| 2016-17 | 4,31,891 |
| 2017-18 | 4,75,308 |
| 2018-19 | 5,43,033 |
| 2019-20 | 5,82,126 |
| 2020-21 | 6,28,615 |
| 2021-22 | 7,78,121 |
| 2022-23 | 9,05,715 |

### తొమ్మిదేండ్లలో ఐటీ ఎగుమతులు ఇలా

| | |
|---|---|
| 2014లో - | రూ.66,276 కోట్లు |
| 2023లో - | రూ.2,41,275 కోట్లు |
| పెరుగుదల - | 264 శాతం |

### పదేండ్లలో ఐటీ ఎగుమతుల విలువ

| సంవత్సరం | ఎగుమతులు (రూ. కోట్లలో) |
|---|---|
| 2014-15 | 66,276 |
| 2015-16 | 75,070 |
| 2016-17 | 85,470 |
| 2017-18 | 93,442 |
| 2018-19 | 1,09,219 |
| 2019-20 | 1,28,807 |
| 2020-21 | 1,45,552 |
| 2021-22 | 1,83,569 |
| 2022-23 | 2,41,275 |

**చెరువులోంచి పాత నీరు పోతా ఉంటేనే కొత్త నీటికి అవకాశం దొరుకుతుంది. అంతేకానీ, పాత నీటికి అడ్డుకట్ట వేయాలనే ప్రయత్నాలు చేయడం, అయ్యో.. ఆ నీరు పోతే ఎట్లా..? అని బాధపడుతూ కూర్చోవడంలో అర్థం లేదు. నీళ్లు మలెపడినా కొద్దీ మురుగు వాసన పెరుగుతుంది. ఆ దుర్వాసనతో ప్రజలకు నష్టమే తప్ప, సమాజానికి ఒనగూడే ప్రయోజనం ఏమీ ఉండదు. ప్రస్తుతం రాజకీయ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న బీఆర్ఎస్ పార్టీ ఈ చిన్న సూత్రాన్ని గుర్తుంచుకొని ముందుకు నడవాల్సిన అవసరం ఉన్నది.**

# ఉరకలేస్తున్న ఉడుకు రక్తం!



గడ్డం సతీష్
99590 59041




***

తెలంగాణ కోసం తెగించి కొట్లాడి, రక్తాన్ని చిందించకుండా శాంతియుత మార్గంలో రాష్ర్టాన్ని సాధించి, ఆ రాష్ర్టాన్ని పదేండ్లు ప్రగతి పథంలో నడిపిన బీఆర్ఎస్ పార్టీకి ప్రస్తుతం సంధికాలం నడుస్తున్నది. 2001 ఏప్రిల్ 27న ఆవిర్భవించిన నాటి నుంచి ఇలాంటి ఒడిదుడుకులను, ఎత్తుపల్లాలను ఎన్నింటినో ఆ పార్టీ చవిచూసింది. ఇవన్నీ బీఆర్ఎస్ పార్టీకి కొత్తేం కాదు, కింద పడినప్పుడల్లా గోడకు కొట్టిన బంతిలా రెట్టించిన వేగంతో దూసుకువచ్చిందే తప్ప ఏనాడూ 'అయ్యో.. నా పనైపోయిందే' అని డీలా పడిపోలేదు. ఇప్పుడు కూడా అంతే.. బీఆర్ఎస్ తిరిగి పుంజుకుంటుంది. దానికి సమయం కూడా ఎంతో పట్టదు. కానీ, 'బీఆర్ఎస్ పనైపోయింది', 'ఆ పార్టీ ఎమ్మెల్యేలు కట్టగట్టుకొని వేరే పార్టీకి వలసలు పోతున్నారు..', 'ఇక బీఆర్ఎస్ పార్టీని ఏదో ఒక జాతీయ పార్టీలో విలీనం చేయాల్సిందే' అంటూ కొందరు వేణుస్వామి తరహాలో జోస్యం చెప్తున్నారు. గోతికాడి నక్కల్లా కాచుక్కూచునే పచ్చమీడియా, దానికి సంబంధించిన కొన్ని టీవీ, యూట్యూబ్ చానళ్లు 'మేమేమైనా తక్కువ తిన్నామా' అంటూ రకరకాలు కథనాలను వండి వడ్డిస్తున్నాయి. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేల్లో లేనిపోని భయాందోళనలను రేకెత్తిస్తున్నాయి. దీంతో సందట్లో సడేమియా అన్నట్టు... ఏ ఎండకు ఆ గొడుగు పట్టే జంప్ జిలానీలకు అవకాశం దొరికినట్టయ్యింది. బెల్లం ఉన్న చోటే ఈగలు వాలుతాయన్నట్టుగా.. అధికారం ఉన్న చోట రాజకీయ నాయకులు వాలిపోతారని మరోసారి రుజువు చేస్తున్నారీ జంప్ జిలానీలు. తాజాగా కాంగ్రెస్ కండువా కప్పుకొన్న మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆ కోవకు చెందినవారే. ఆయన వ్యక్తిగత లబ్ధి కోసం పార్టీ కండువాను మార్చారే తప్ప, ప్రజలకు ఏదో వెలగబెడతామనైతే కాదనేది నగ్న సత్యం. కండువా కప్పుకొని కామ్‌గా ఉంటే ఆయననూ అనేవారెవరూ ఉండరు, అడ్డుకునేవారెవరూ ఉండరు. కానీ, 'సీఎం రేవంత్ రెడ్డి రైతులకు మేలు చేస్తున్నారు, అందుకే కాంగ్రెస్‌లోకి వెళ్తున్నా' అని ప్రకటించడమే కొంచెం విడ్డూరంగా ఉన్నది. కొంచెం వెగటు కూడా పుట్టిస్తున్నది.

మొన్న కేకే కావచ్చు, నిన్న పోచారం కావొచ్చు, రేపు ఇంకొకరు కావచ్చు, ఆ తర్వాత వేరేవారూ కావచ్చు... తలపండిన ఏ ఇతర సీనియర్ నాయకులు, ఏ ఇతర ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌ను వీడినా ఆ పార్టీకి వాటిల్లే నష్టమేమీ ఉండదు. కాబట్టి వెళ్తామనుకునేవాళ్లకు శాలువా కప్పి, తిలకం దిద్ది మరీ సాగనంపాలి. ఎందుకంటే పద్నాలుగేండ్ల పాటు ఉద్యమంలో, పదేండ్ల పాటు ప్రగతి యుద్ధంలో చెమటలు ధారపోసిన యువకులు, ఎంతోమంది కార్యకర్తలు సిద్ధంగా ఉన్నరు తెలంగాణ అభివృద్ధి ఎజెండాను కిందపడనివ్వకుండా పట్టుకోవడానికి. ఆ యువకులకు పదవులు ముఖ్యం కాదు, తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యం. తెలంగాణ ప్రజల బాగోగులే వారికి ప్రధానం. వాళ్లు ఏనాడూ పదవులకు ఆశపడి తెలంగాణ జెండాను మోయలేదు. ప్రాణాలు పోయినా సరే 'మా తెలంగాణ మాగ్గావాలె' అని కొట్లాడిన ధీరులు వాళ్లు. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడేందుకు చెమటను ధారపోసిన తెలంగాణ పరిరక్షకులు వాళ్లు.

నాకు తెలిసిన ఒక తమ్ముడు తాడబోయిన విజయ్. కరడుగట్టిన తెలంగాణ వాది. ఎంత అంటే ఇంటిపేరునే తెలంగాణ అని మార్చుకునేంత. ముదిరాజు సామాజికవర్గానికి చెందిన ఈ యువకునికి నిల్వ నీడ లేదు. రెక్కాడితేగానీ డొక్కాడని జీవితం తనది. అయినా సరే బీఆర్ఎస్ పార్టీ పురుడు పోసుకున్న నాటి నుంచి నేటి దాకా తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం అహరహం శ్రమిస్తున్నాడు. కుటుంబాన్ని ఎల్లదీసేటందుకు ఓ దిక్కు ఎవుసం చేసుకుంటనే ఇంకో దిక్కు పార్టీ కోసం పనిచేస్తున్నాడు. ఒక్క విజయే కాదు, విజయ్ లాంటి లక్షలాది మంది వీర సైనికులు బీఆర్ఎస్ పార్టీ సొంతం. అలాంటివాళ్లు నాయకులుగా తయారైతే తెలంగాణ పది కాలాల పాటు సుభిక్షంగా పరిఢవిల్లుతుంది.

ఈ సంకట స్థితిలో బీఆర్ఎస్ చేయవలసిన పనులు రెండున్నాయి. మొదటిది పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలను కాపాడుకోవడం, రెండోది నీతి, నిజాయతీ గల యువ నాయకులను తయారు చేసుకోవడం.

**రాష్ట్రంలో మొన్నటిదాన్క నీటితో కళ కళ లాడిన బీఆర్ఎస్ చెరువు ఇవ్వాళ ఎండిపోయే పరిస్థితికి చేరిందంటే దానికి ప్రధాన కారణం పాత నీళ్లే. ఈ నీళ్లు కొత్త నీటిని అడ్డుకున్నాయి. కొత్త నీళ్లు వస్తే తమను ఇటు ప్రజలు, అటు అధిష్ఠానం పట్టించుకోదని గ్రహించి అందినకాడికి పరుచుకున్నాయి. కొత్త నీటిని అణగదొక్కినయి. వాటికి అవకాశాలు రాకుండా చేసినయి. అధిష్ఠానానికి దూరాన్ని పెంచినయి. పాత నీరు ఇప్పుడు బయటికి పోతున్న కొద్దీ ముందుగాళ్ల సంబురపడేది కొత్త నీళ్లే. ఇన్నిరోజులు ఎదురుచూసినందుకు ఇప్పటికైనా తమకు అవకాశాలు దక్కుతాయని ఉత్సాహంతో, ఉడుకు రక్తంతో ఉరకలెత్తుతున్నాయి. అయినా కొత్తనీటి ముందు పాత నీరెంత? ఆకాశంలో అణువంత! కొత్త నీటి తడలకు పాత నీళ్లు కొట్టుకుపోయి మూసీ నదిలో కలిసిపోవడం ఖాయం.**

# సభాపతి పీఠానికి తప్పని సమరం

**ఇటీవలి పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ సాధారణ మెజారిటీకి అవసరమైన 272 సీట్లను సాధించకపోవడం కొత్త పరిణామాలకు దారితీస్తున్నది. లోక్‌సభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవులను బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే, కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి మధ్య ఏకాభిప్రాయ సాధన ద్వారా భర్తీ చేస్తారనే అంచనా తప్పింది.**



నాంచారయ్య మెరుగుమాల



పాత పార్లమెంటరీ సంప్రదాయం ప్రకారం డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్షాలకు ఇస్తే స్పీకర్ పదవికి విపక్షాలు పోటీ పెట్టబోవనే ప్రతిపాదన వచ్చినా.. బీజేపీ అందుకు నిరాకరించింది. దీంతో కేరళ మావెలిక్కర నుంచి 8 సార్లు గెలిచిన కాంగ్రెస్ దళిత నేత కొడికున్నిల్ సురేశ్‌ను ప్రతిపక్షాలు పోటీకి దింపడంతో సభాపతి పదవికి ఎన్నిక అనివార్యమైంది. 48 ఏండ్ల తర్వాత ఈ రాజ్యాంగ పదవికి పోటీ జరగడం ఇదే మొదటిసారి.

18వ లోక్‌సభ స్పీకర్‌గా బీజేపీ ఎంపీ ఓం బిర్లా బుధవారం మూజువాణి ఓటు ద్వారా ఎన్నికవడంతో గతంలో జరిగిన 3 ఎన్నికలు గుర్తుకువస్తున్నాయి. 1952 నుంచి చూస్తే స్పీకర్ పదవికి ఇలా ఎన్నిక జరగడం ఇది నాలుగోసారి. మొదటి సార్వత్రిక ఎన్నికలయ్యాక 1952లో భారత పార్లమెంటు దిగువ సభ స్పీకర్ పదవికి కాంగ్రెస్ అభ్యర్థి గణేశ్ వాసుదేవ్ (జీవీ) మావలంకర్‌పై తమ ఉమ్మడి అభ్యర్థిగా శంకర్ శాంతారాం మోరేను ప్రతిపక్షాలు పోటీకి నిలిపాయి. పండిత నెహ్రూ నాయకత్వంలోని కాంగ్రెస్‌కు ఉన్న తిరుగులేని మెజారిటీ కారణంగా గుజరాత్‌కు చెందిన మావలంకర్ సునాయాసంగా ఎన్నికయ్యారు. మహారాష్ట్రకు చెందిన మోరే అత్యధిక తేడాతో (394-55 ఓట్లు) ఓడిపోయారు.

**ఇద్దరు తెలుగు నేతల మధ్య స్పీకర్ పదవి కోసం పోటీ:** మళ్లీ 15 ఏండ్ల తర్వాత ఇందిరాగాంధీ ప్రధానిగా ఉండగా జరిగిన మొదటి పార్లమెంట్ ఎన్నికలయ్యాక (1967) స్పీకర్ పదవికి రెండోసారి ఎన్నిక జరిగింది. నాలుగో లోక్‌సభ స్పీకర్ పదవికి నాటి ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి కాంగ్రెస్ తరపున నామినేషన్ వేయగా ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా మరో తెలుగు నేత తెన్నేటి విశ్వనాథం పోటీకి దిగారు. కాంగ్రెస్ పార్టీకి 19 67 పార్లమెంటు ఎన్నికల్లో 300 లోపు సీట్లు రావ డం, దాదాపు పది రాష్ట్రాల్లో ప్రతిపక్షాలు ఎక్కువ స్థానాలు గెలుచుకోవడంతో తెన్నేటి పరాజయం పాలైనా 200కి పైగా ఓట్లు సంపాదించగలిగారు. ఆం ధ్రా ప్రాంతానికి చెందిన రెండో స్పీకర్‌గా (మొదటి తెలుగు స్పీకర్ మాడభూషి అనంతశయనం అయ్యంగార్ వరుసగా 1956, 1957లో స్పీకర్ అయ్యారు. తమిళ వైష్ణవ కుటుంబ మూలాలున్న ఆయన తిరుపతి, చిత్తూరు నుంచి లోక్‌సభకు గెలిచారు) నీలం సంజీవరెడ్డి 278-207 ఓట్ల తేడాతో సభాపతిగా ఎన్నికయ్యారు. విశాఖపట్నం నుంచి గెలిచిన తెన్నేటిని హిందూపురం ఎంపీ అయిన నీలం ఓడించారు. తర్వాత ఐదో లోక్‌సభ ఎన్నికల్లో (1971 తొలి మధ్యంతర లేదా ముందస్తు ఎన్నికలు) కాంగ్రెస్ మూడింట రెండొంతుల మెజారిటీ సాధించడంతో కాంగ్రెస్ నేత, గురుదయాళ్ సింగ్ (జీఎస్) ధిల్లాన్ రెండోసారి స్పీకర్‌గా పోటీ లేకుండా 1971లో ఎన్నికయ్యారు. 1967లో స్పీకర్ పదవి చేపట్టిన సంజీవరెడ్డి 1969 రాష్ట్రపతి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికార అభ్యర్థిగా పోటీ చేయడానికి పదవికి రాజీనామా చేశాక జీఎస్ ధిల్లాన్ అప్పుడు కాంగ్రెస్ తరపున స్పీకర్‌గా మొదటిసారి ఎన్నికయ్యారు. ఎంఏ అయ్యంగార్ మాదిరిగానే మళ్లీ రెండోసారి స్పీకర్ అయ్యే అవకాశం ఈ సిక్కు కాంగ్రెస్ నేతకు లభించింది. ధిల్లాన్ రెండోసారి స్పీకర్‌గా ఐదేండ్ల పదవీ కాలం పూర్తిచేసుకోవడానికి కొన్ని మాసాల ముందు 1975 డిసెంబర్‌లో ఇందిర మంత్రివర్గంలో చేరారు. ధిల్లాన్ రాజీనామా ఫలితంగా ఖాళీ అయిన స్పీకర్ పదవికి మూడోసారి 1976లో ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలో బీహార్‌కు చెందిన బీసీ నేత బలిరామ్ భగత్ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఆయనపై ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి జగన్నాథరావు జోషీ (జనసంఘ్) పోటీ చేశారు. భగత్ 344-58 ఓట్ల తేడాతో మధ్యప్రదేశ్ షాజాపూర్ ఎంపీ అయిన జోషీని ఓడించారు. కర్ణాటక ధార్వాడ్ మరాఠీ కుటుంబంలో పుట్టిన జోషీ ఎంపీ నుంచి రెండుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. స్పీకర్ పదవికి 1952, 1967, 1976 తర్వాత ఏకగ్రీవానికి బదులు ఎన్నిక జరగడం ఇప్పుడు (2024) నాలుగోసారి. తొలి లోక్‌సభ ఎన్నికల నుంచి 2019లో జరిగిన 17వ లోక్‌సభ ఎన్నికల వరకూ 17 మంది నాయకులు ఈ పదవికి ఎన్నికయ్యారు.

స్పీకర్‌గా రెండేసిసార్లు చేసిన నేతలు ఆరుగురు, వారిలో ఆంధ్రా నేతలు ముగ్గురు: లోక్‌సభ స్పీకర్ పదవిని రెండేసి సార్లు అధిష్ఠించిన నేతలు ఆరుగురు ఉండగా వారిలో తెలుగు వారు ఇద్దరు. ఈ ఆరుగురిలో మొదటి అవకాశం రెండో స్పీకర్ ఎంఏ అయ్యంగార్‌కు రాగా, తర్వాత సంజీవరెడ్డికి వచ్చింది. నీలం మొదటిసారి రెండేడ్లు (1967-69) ఈ పదవిలో కొనసాగగా, రెండోసారి కేవలం 109 రోజులే ఉన్నారు. జనతా పార్టీ తరపున ఏకగ్రీవంగా స్పీకర్ అయిన నీలం మూడు నెలల తర్వాత 1977 ఆగస్టులో రాష్ట్రపతిగా పోటీ లేకుండా ఎన్నికయ్యారు. ప్రధాని ఇందిరాగాంధీ ఆశీస్సులతో జీఎస్ ధిల్లాన్ రెండుసార్లు స్పీకర్ కాగలిగారు. ఆయన మొదటిసారి రెండేండ్లలోపే సభాపతిగా ఉన్నారు. రెండోసారి 1971లో ఈ పదవికి ఎన్నికయ్యాక నాలుగున్నరేండ్లకు పైగా ఈ పదవిలో కొనసాగారు. రెండుసార్లు స్పీకర్‌గా ఎన్నికయ్యాక పూర్తి పదవీకాలం పదవిలో ఉన్న ఏకైక నేత కాంగ్రెస్ నేత బలరాం జాఖడ్. పంజాబ్‌కు చెందిన ఈ జాట్ నేత జాఖడ్ 1980 నుంచి 1989 మధ్య దాదాపు పదేండ్లు సభాపతిగా ఉండటం ఇప్పటికీ రికార్డు. జాఖడ్ తర్వాత రెండు సార్లు ఈ పదవికి ఎన్నికైనది టీడీపీకి చెందిన దళిత నేత గంటి మోహన్ చంద్ర (జీఎంసీ) బాలయోగి. 1998లో స్పీకర్‌గా ఎన్నికైన బాలయోగి 1999 మధ్యంతర ఎన్నికల తర్వాత కూడా అదే పదవిని చేపట్టారు గాని 2002 మార్చిలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో కన్నుమూశారు. ఫలితంగా ఆయన రెండు పదవీకాలాలు కలిపి దాదాపు నాలుగేండ్లే. బాలయోగి తర్వాత తాజాగా స్పీకర్‌గా వరుసగా రెండోసారి ఎన్నికైన ఓం బిర్లా 18వ లోక్ సభ సభాపతిగా పూర్తికాలం కొనసాగి జాఖడ్ రికార్డును అధిగమించేదీ, లేనిదీ 2029లోపే తేలిపోతుంది.